మట్టి మాఫియాతో గుండె 'చెరువు'

కారిజాత చెరువును తవ్వేసిన అక్రమార్కులు





- ఆగని వైసీపీ నాయకుల ఆగడాలు
- రాత్రివేళ భారీగా అక్రమ రవాణా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల మట్టి అక్రమ రవాణా ఆగలేదు. సాగునీటి చెరువులే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. రెండు వారాల నుంచి గోపాల్ రెడ్డిపాలెం చెరువు, తడ మండలం కారిజాత చెరువుల్లో భారీగా మట్టి తవ్వేస్తున్నారు. చీకటిపడ్డాక సూళ్లూరుపేటలోని ఇళ్లప్లాట్లు, కొత్త వెంచర్లకు ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. ఈ చెరువుల మట్టికి గిరాకీ ఉండడంతో పది అడుగుల మేర తవ్వేయడం ఆందోళన కలిగిస్తోంది. తవ్వకాల వల్ల చెరువులో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో కట్టకు ప్రమాదమేర్పడుతుందంటున్నారు. వైసీపీ నాయకుల తవ్వకాలకు అధికార పార్టీ నాయకుడొకరి అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కారిజాత రోడ్డు నుంచి శ్రీహరికోట మార్గంలో రాత్రిపూట మట్టి ట్రాక్టర్లు జోరందుకుంటున్నాయి..

పట్టించుకోని అధికారులు

చెరువుల గర్భాన్ని తొలిచేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదు. కళ్లెదుటే మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా వీరు మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం అంతుబట్టడం లేదు. రైతులు సొంతపొలంలో మట్టి తీయాలన్నా అనుమతులు కావాలనే అధికారులు ఏకంగా చెరువుల్లో మట్టిని తవ్వి తరలిస్తున్నా కిమ్మనడం లేదు. ఇకనైనా అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.



చెరువులో మట్టిని తవ్వేందుకు ఏర్పాటు చేసుకున్న రోడ్డు

మార్టిగేజ్ రద్దుకు లంచం అడుగుతున్నారు

- రైతు ఫిర్యాదుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే
- 16 రోజులుగా తిప్పించుకుంటారా అంటూ ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'నా భూమి మార్టిగేజ్ రద్దుకు 16 రోజులుగా తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు లంచం కోసం వేధిస్తున్నారు' అంటూ ఓ రైతు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, రెవెన్యూ మంత్రికి ఫోనుచేసి కోరారు. వివరాలిలా ఉన్నాయి. కేవీబీపురం మండలం గురుకుల కండ్రిగకు చెందిన విశ్రాంత వీఆర్వో, రైతు జనార్దన్‌రెడ్డి తన భూమిని మార్టిగేజ్ చేసి రుణం పొందాడు. ఇటీవల రుణం కట్టేసిన ఆయన మార్టిగేజ్ రద్దుకోసం ఒకటో తేది నుంచి తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. 4న మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసి వారం తర్వాత తీసుకున్నారు. మార్టిగేజ్ రద్దుకోసం రూ.1,500 చలానా, స్పెషల్ స్టాంపు తదితరాలు సిద్ధం చేసుకుని మంగళవారం వచ్చారు. బ్యాంకు అధికారులు రాలేదు. బుధవారం వచ్చిన జనార్దన్‌రెడ్డి.. లంచం కోసం మార్టిగేజ్ రద్దు ఆలస్యం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. పీఆర్ అతిథి గృహంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే.. వెంటనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. లంచం కోసం సిబ్బంది వేధిస్తున్నారని సబ్‌రిజిస్ట్రార్‌కు చెబితే దురుసుగా మాట్లాడారని, ఓ రైటర్ రూ.3,400 తీసుకున్నారంటూ ఎమ్మెల్యేకి రైతు చెప్పారు. చిన్నపాటి మార్టిగేజ్ రద్దుకు ఇన్ని రోజులు తిప్పించుకోవడం ఏంటని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ అవినీతికి పాల్పడుతున్నారంటూ 30మందికిపైగా తనకు ఫిర్యాదు చేశారన్నారు. అందుకనే తిరుపతిలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు తన సన్నిహితులు చెప్పారని ఆగ్రహించారు. ఎమ్మెల్యేకి వాటాలివ్వాలంటూ తన పేరు చెప్పి ఎలా వసూలు చేస్తారంటూ నిలదీశారు. అలాంటి ప్రచారం తానెప్పుడూ చేయలేదని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ జవాబిచ్చారు. ఆ తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.



తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అందరు ఎమ్మెల్యేలూ ఇలా చేస్తే.. : 'తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై చాలా ఫిర్యాదులు వస్తుండటంతో అవినీతికి అంతం పలకాలని మెరుపువేగంతో స్పందించాను. దీనిపై చర్యలు తీసుకోవాలి. సీఎంచంద్రబాబు, యువనేత లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలందరూ ఇలా అవినీతి ఆరోపణలున్న కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు చేసి లంచాలను అరికట్టాలని కోరుతున్నా' అని సుధీర్‌రెడ్డి మీడియాతో అన్నారు. ఎమ్మెల్యే స్పందించిన తీరు సంతోషంగా ఉందని రైతు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఎందుకు జాప్యం జరిగిందనే దానిపై విచారిస్తున్నాం అని సబ్‌రిజిస్ట్రార్ సుధాకర్ చెప్పారు.

ప్రభుత్వ భూముల్లో

ఇల్లు కట్టుకున్నారా!

- క్రమబద్ధీకరణకు అవకాశం
- జీవో నెంబరు 30ను సద్వినియోగం చేసుకోండి
- వాగు వంకల్లో కట్టుంటే అవకాశం లేదు
- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల్లో పేదలు ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుని ఉంటే వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. దీనికోసం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇల్లు కట్టుకున్న వారు పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరించి మంజూరు చేస్తామన్నారు. 2019 అక్టోబరు 15కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఉండాలన్నారు. 150 చదరపు గజాల్లోపు ఆక్రమించి ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరించి ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. 150 నుంచి 300 చదరపు గజాల్లోపు అయితే బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) వారు 15శాతం బేసిక్ వాల్యూ, 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు.. ఏపీఎల్ వారు 15 శాతం రిజిస్ట్రేషన్ బేసిక్ వాల్యూ, యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 301 నుంచి 450 చదరపు గజాలకు సంబంధించి బీపీఎల్ వారికి వంద శాతం బేసిక్ వాల్యూ, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏపీఎల్ వారు 200 శాతం బేసిక్ వాల్యూ, యధావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు.. 451చదరపు గజాలపైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నివాసం ఉన్నవారెవరైనా సరే బేసిక్ వాల్యూపై 5రెట్లు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 లోపు గ్రామ, వార్డు సచిలయాల్లో, తహసీల్దారు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పిస్తే ఆ ప్రాంతంలోని వీఆర్వో, వార్డు అధికారులు విచారించి ఆయా ప్రాంతాలను బట్టి, తహసీల్దారు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారని తెలిపారు. వాటిని సబ్‌డివిజన్ కమిటీలో చర్చించి ఆమోదిస్తామన్నారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఆ ప్రాంతంలో తాము నివసిస్తున్నట్లు ఆధారాలుగా రిజిస్టర్ డాక్యుమెంట్, ఇంటిపన్ను, కరెంటు బిల్లు, నీటిపన్నులో ఏదో ఒకటి సమర్పించాలన్నారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 955 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

వీళ్లకు అవకాశం లేదు

మాస్టర్‌ప్లాన్ రోడ్డు, జోనల్‌ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లేఅవుట్ స్థలాలు, పంట పొరంబోకులు, కాలువ పొరంబోకు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమించి ఉంటే క్రమబద్ధీకరణ సాధ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన జేసీ శుభం బన్సల్



ఈ ప్రశ్నలకు బదులేది?



"తులాభారం ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకుల ద్వారా స్వామి ఖజానాకు వెళ్లాల్సింది పోయి కొంతమంది చేతుల్లోకి వెళ్లింది. దీనిపై విచారణ చేపట్టి కొందరు తాత్కాలిక ఉద్యోగులను మాత్రమే తొలగించారు. వాళ్లని జైలుకు ఎందుకు పంపలేదు? ఆ కోట్లాది డబ్బు ఏమైంది? మీ ఇంట్లో కోటి రూపాయలు పోతే కేసులు పెట్టకుండా ఉంటారా? దేవుడికో న్యాయం, మీకో న్యాయమా? దీనిపై మౌనం వెనుక ఏముంది? 2019 ముందు ఏమీ లేని వాళ్లు కోట్లాది రూపాయలకు ఎలా పడగలెత్తారు? గోవులు చనిపోయాయంటూ రాజకీయం చేస్తున్నవారు సమాధానం చెప్పాలి. "

\- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

స్వార్థరాజకీయాల కోసం గోశాలను ఎన్నుకోవద్దు



"స్థానికంగా ఉండేవారు ఎవరైన కొండకు యాత్రీకులు పెరిగే విధంగా ప్రయత్నించాలి. అంతేకానీ విషప్రచారంతో భయపెట్టకూడదు. రాజకీయంగా ఏదైనా ఉంటే వేరే అంశాలతో విభేదించండి. చర్చాగోష్ఠిల్లో సవాళ్లు విసురుకోండి. స్వార్థరాజకీయాల కోసం గోశాలను ఎన్నుకోకూడదు.మన వ్యవస్థలను మనమే ధ్వంసం చేయకూడదు."

\- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

యూఎస్‌లో స్టేట్ మంత్రిగా చంద్రగిరివాసి

చంద్రగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన బద్రి లంకెళ్ల ఇటీవల అమెరికాలోని విస్కాన్‌సిన్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్-7లో ఆల్డర్ పర్సన్‌గా 53.8 శాతం ఓట్లతో ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన ఆ స్టేట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకురాలు లంకెళ్ల లలిత, శ్రీరాముల కుమారుడు బద్రి విస్కాన్‌సింగ్ స్టేట్‌లోని మాడిసన్ డిస్ట్రిక్-7లో సుమారు పాతికేళ్లుగా ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన ఆల్డర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు.తాజాగా నాలుగు శాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై చంద్రగిరిలో పలువురు సన్నిహితులు బద్రిని ఫోన్లో అభినందించారు.



బద్రి లంకెళ్ళ

'కొండ'పైకి డ్రోన్ ఎలా తీసుకెళ్లారు?

- అలిపిరి టోల్‌గేట్‌లో ఎస్పీ తనిఖీలు



టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో డ్రోన్ కలకలం నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో (ఎఫ్ఏసీ) హోదాలో బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు అలిపిరి టోల్‌గేట్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'ఇటీవల తిరుమలకు డ్రోన్ ఎలా తీసుకెళ్లగలిగారు? తనిఖీలు ఎందుకు చేయలేదు? టోల్‌గేట్ వద్ద సిబ్బంది ఎందుకంత నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టోల్‌గేట్ నుంచి తిరుమలకు ఏవైనా నిషేధిత వస్తువులు వెళ్లినట్లు తెలిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు, లగేజీలు ఎలా తనిఖీచేస్తున్నారు. లగేజీ స్కాన్ చేయడానికి ఎంత సమయం పడుతుందనేది పరిశీలించారు. ప్రతి ఇమేజ్‌ను క్షుణంగా పరిశీలించాలని టోల్‌గేట్ స్కానర్ మానిటర్ వద్ద సిబ్బందిని ఆదేశించారు. అనుమానమున్న వస్తువులను ఫిజికల్‌గా తనిఖీ చేయాలన్నారు.

నేడు జిల్లాకు 16వ ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : 16వ ఆర్థిక కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా 15మంది సభ్యులతో కలిసి గురువారం తిరుపతికి రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఉదయం 11.30 గంటలకు వచ్చి తాజ్ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రూరల్, 3.15 గంటలకు అర్బన్ స్థానిక సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశమవుతారని తెలిపారు. 4 గంటలకు వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం ఉంటుందన్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుమల చేరుకుని శుక్రవారం తెల్లవారుజామున శ్రీవారి దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారన్నారు. అధికారులు సమన్వయంతో సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని బ్యాంకర్లకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నాబార్డు రూపొందించిన రుణ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లా నాబార్డు రుణ ప్రణాళిక రూ.18,032.41కోట్లతో రూపొందించినట్లు తెలిపారు. బ్యాంకింగ్ యాప్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు జిల్లా మేనేజరు సునీల్, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికిగాను ఉచిత సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం తెలిపారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం బలహీన వర్గాల పిల్లలకు ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయిస్తోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్లు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈనెల 28 నుంచి వచ్చేనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్ ద్వారా cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నింటినీ పరిశీలించిన తరువాత విద్యాసంవత్సరం ప్రారంభంలోపు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బలహీన వర్గాల పిల్లలకు ఉచిత సీట్లను కేటాయిస్తుంది. ఇతర సమాచారం కోసం డీఈవోను లేదా టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించవచ్చు.

హిందీ భాష అమలెలా ఉంది?



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): యూజీసీ పరిధిలోని రాజ భాషా సమితి సభ్యులు తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలో బుధవారం పర్యటించారు. బోధన, పరిశోధన, పాలనా రంగాల్లో హిందీ భాష అమలు తీరును పరిశీలించారు. ఈ బృందంలో డాక్టర్ అశోక్ కుమార్, వి.కె.సుదర్శనదేవి ఉన్నారు. యూనివర్సిటీలోని అన్ని అంశాల్లో హిందీ భాషను పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు వారికి వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి వివరించారు.



ప్రేక్షకులనుద్దేశించి మాట్లాడుతున్న చిత్ర బృందం

జనం మెచ్చిన సినిమా 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి'

హీరో ప్రదీప్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' జనం మెచ్చిన సినిమా అని, ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి ఈ మాట అంటున్నానని హీరో ప్రదీప్ మాచిరాజు అన్నారు. విజయయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం వేల్‌రామ్స్ థియేటర్‌లో చిత్రబృందం సందడి చేసింది. ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించింది. సినిమాలోని డైలాగులు చెబుతూ అలరించారు. అనంతరం హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక, దర్శకులు నితిన్, భరత్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన సినిమాకు మంచి స్పందన లభిస్తోందని, ప్రేక్షకులు కుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చి చూస్తుండడం సంతోషం కలిగిస్తోందని అన్నారు. మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఐసీఏఐ భవన నిర్మాణానికి భూమిపూజ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) తిరుపతి శాఖ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఉదయం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు చరణ్‌సింగ్‌నంద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన భవనం ద్వారా విద్యార్థులు, సభ్యులకు నాణ్యమైన శిక్షణ, వృత్తిపరమైన వేదిక, ఆధునిక వసతులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రసన్నకుమార్, ఐసీఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్ ముప్పాల, దక్షిణ ప్రాంత మండలి ఛైర్‌పర్సన్ రేవతిరఘునాథన్, ప్రధాన కార్యదర్శి జైకుమార్, తిరుపతి శాఖ అధ్యక్షుడు మధుసూదనబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో తిరుపతి యువతికి గోల్డ్ మెడల్



ముత్యాలమ్మను సన్మానిస్తున్న ప్రవీణ్

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన ముత్యాలమ్మ బంగారు పతకం కైవసం చేసుకుంది. ఆమెను బుధవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ ఘనంగా సన్మానించారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆమె తల్లిదండ్రులు కె.మల్లయ్య, రమణమ్మ, కోచ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీపీగా శ్రీనివాసరావు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్ కోర్టుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కె.శ్రీనివాస రావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హోంశాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజాదర్బార్‌కు 64 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) : టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ నివాసంలో బుధవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 64 వినతులు వచ్చాయి. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 52 అభ్యర్థనలు రాగా మిగిలినవి ఇతర విభాగాల నుంచి వచ్చాయి. మున్సిపల్, పోలీస్ విభాగ సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు శ్రీధర్ వర్మ, చినబాబు, బుల్లెట్ రమణ, బీజీ కృష్ణ యాదవ్, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీరాం, మన్నెం శ్రీనివాసులు, విశ్వనాథం, రాజారామ్ పాల్గొన్నారు.

వ్యాస రచన విజేతలకు బహుమతులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు బహుమతులు పొందారు. శరత్, హసనవలి, అభిషేక్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో తెలుగు వ్యాస రచన పోటీలో బహుమతులు పొందారు.సాయిఅఖిల్ ప్రథమ స్థానంలో, జగదీశ్వరరెడ్డి ప్రోత్సాహక బహుమతికి ఇంగ్లిషు వ్యాస రచన పోటీల విజేతలుగా నిలిచారు.

కేంద్ర మంత్రికి ఎన్ఎస్ఎస్ సత్కారం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి రక్ష నిఖిల్ ఖాడ్సేకు పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఘన స్వాగతం పలికింది. రేణిగుంట విమానాశ్రయంలో శాలువా, పుష్ప గుచ్ఛం, జ్ఞాపికతో వారు సత్కరించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లలిత కుమారి, ప్రోగ్రాం ఆఫీసర్ యువశ్రీ సత్కరించిన వారిలో ఉన్నారు.

కేబుల్ దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లలో కేబుల్ చోరీకి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అలిపిరి పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లలో ఇటీవల వైర్లు చోరీకి గురవుతున్నాయి. మంగళం రోడ్డులోని కూరపాటి లేఅవుట్‌లో నిర్మిస్తున్న భవనాల్లో వరుసగా వైర్లు చోరీకి గురవుతుండడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాని సాయంతో స్థానికులు దొంగను పట్టుకుని అలిపిరి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతన్ని విచారిస్తున్నారు.

ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నం



గాయపడిన మణికంఠ

తిరుపతి(నేరవిభాగం),ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ఉదయం ఎయిర్ బైపాస్ రోడ్డులోని న్యూ ఇందిరానగర్ వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. న్యూ ఇందిరానగర్‌కు చెందిన మణికంఠ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యక్తిగత తగాదాలతో దాసరి మఠానికి చెందిన తరుణ్ తండ్రిని 15 ఏళ్ల క్రితం మణికంఠ అతని స్నేహితులతో కలిసి చంపేశాడు. ఈ క్రమంలో ఎలాగైనా మణికంఠను చంపాలని తరుణ్ పథకం పన్నారు. బుధవారం ఇందిరానగర్ వద్ద ఉన్న మణికంఠపై తరుణ్, అతని స్నేహితులు కత్తి, రాళ్లతో దాడి చేశారు. మణికంఠ తలకు బలమైన గాయాలయ్యాయి. వారి నుంచి తప్పించుకుని ఆస్పత్రిలో చేరాడు. ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. పాత కక్షలతో గొడవ జరిగినట్లు స్థానికులు చెప్పారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలో ఈనెల 11న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. పీలేరుకు చెందిన చాంద్‌బాషా బైరాగిపట్టెడలో కాపురముంటూ చికెన్ సెంటరు నడుపుకుంటున్నాడు. వ్యాపారం కోసం స్నేహితుడు సురేష్ వద్ద రూ.50వేలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించకపోవడంతో ఐదు రోజుల క్రితం సురేష్ గట్టిగా అడిగాడు. ఆ గ్రహానికి గురైన చాంద్‌బాషా 'నన్నే డబ్బు అడుగుతావా' అంటూ కత్తితో పొడవడంతో సురేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం బైరాగిపట్టెడ పార్కు వద్ద ఉండగా చాంద్‌బాషాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.





కల్వర్టు లోపల నుంచి బయటకు వస్తున్న తెలుగుగంగ నీరు - చెన్నాయిగుంట చెరువులోకి చేరుతున్న నీరు

తెలుగు'గంగ' నేలపాలు

పైపులైన్ లీకేజీతో చెరువులోకి చేరుతున్న వైనం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం. నగరంలో చాలామంది తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో నగరానికి దాహార్తి తీర్చే తెలుగుగంగ నీరు చెరువు పాలు కావడం విమర్శలకు తావిస్తోంది. మంగళం-శెట్టిపల్లి రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన తెలుగుగంగ పైపులు ఓ చోట లీకవుతోంది. ఏడాదికాలంగా నీరు వృథాగా పోతోంది. మురుగునీటితో కలిసి చెన్నాయిగుంట చెరువులోకి చేరుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. చిన్నపాటి కల్వర్టు కింద లీకేజీ అరికట్టడం కష్టమంటూ సరిపెట్టుకుంటున్నారు. వేసవి ముదురుతున్న కొద్దీ నగరంలో నీటి సరఫరా తగ్గుతోంది. కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒకసారి మాత్రమే వదులుతున్నారు. వృథాను అరికడితే నగరంలోని 25 శాతం ఇళ్లకు సరఫరా చేయవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గోవును, గోవిందుడిని రాజకీయాల్లోకి తెస్తే బాగుపడరు



మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గోవును, గోవిందుడిని రాజకీయంగా వాడుకున్నవారు ఎవరూ బాగుపడలేదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ గోశాలపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వేంకటేశ్వర స్వామిపై నమ్మకం లేని వ్యక్తిని రెండుసార్లు ఛైర్మన్‌గా నాటి పాలకులు నియమించారని చెప్పారు. ఆయన హయాంలో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. కరుణాకరరెడ్డి టీటీడీ కీర్తిని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం భావ్యం కాదన్నారు. చెవిరెడ్డి తుమ్మలగుంటలో చెరువును పూడ్చడం వల్ల వర్షపు నీరు గోశాలలో చేరి 60 నుంచి 70 వరకు ఆవులు మరణిస్తే అప్పుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఆయన ఛైర్మన్‌గా ఉన్న సమయంలో పురుగులు పట్టిన దానా, కాలం చెల్లిన మందులు, పాచిపట్టిన నీటిని వాడి గోవుల మృతికి కారణమయ్యారని ఆరోపించారు.

వృద్ధుడి అదృశ్యం



మహదేవ్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం),ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. అలిపిరి పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం పత్ని తాలూకా ఐనపూర్‌కు చెందిన మహదేవ్(60) కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుపతికి వచ్చాడు. బాలాజీ లింక్ బస్టాండు వద్ద తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా కనిపించకపోవడంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అజిత కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 9154141868కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీవితాలను తీర్చిదిద్దే కార్ఖానాలు పాఠశాలలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జీవితాలను తీర్చిదిద్దే కార్ఖానాలు పాఠశాలలని ఉప విద్యాశాఖాధికారి కె. బాలాజీ చెప్పారు. స్థానిక బైరాగిపట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు నగరపాలక ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, తిరుపతి అర్బన్ ఎంఈఓ భాస్కర్‌నాయక్, మహారాజ డెకార్స్ అధినేత కొల్లూరి రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పినట్టు విని, నడుచుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, దేశాభివృద్ధిలో కీలక భాగస్వాములవుతారని చెప్పారు. కల్లూరి రాజశేఖర్, ఎంఈఓ భాస్కర్‌నాయక్, ఎంజీఎం హైస్కూల్ హెచ్ఎం మునిశారద మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రెడ్డిరాణి, బీజేపీ నేత తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతరను వేడుకగా నిర్వహిద్దాం

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు - కలెక్టర్ వెంకటేశ్వర్



సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్, కమిషనర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వచ్చేనెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతర ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశమున్నందున వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం ఉండరాదని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు, తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, ఇతర అధికారులు వెంకటకృష్ణారెడ్డి, జయకుమార్ పాల్గొన్నారు.

సీకాం కళాశాలకు ఉన్నత విద్యామండలి ప్రశంసలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తిరుపతి సీకాం డిగ్రీ కళాశాలపై ప్రశంసలు కురిపించింది. విద్యా ప్రమాణాలు, బోధన, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఇటీవల కళాశాలకు బి ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండోసారి బి ప్లస్ ప్లస్ నాక్ గ్రేడ్ పొందిన కళాశాలగా సీకాం కళాశాల గుర్తింపు పొందింది. 4 సీజీపీఏకి గాను 2.95 సీజీపీఏ సాధించింది. ఉన్నత విద్యామండలి క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రామమోహనరావ్ సీకాం విద్యావిధానాలను ప్రశంసిస్తూ కళాశాలల ఛైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథరెడ్డి, డైరెక్టర్లు టి.తేజ స్వరూప్, టి. ప్రణీత్ స్వరూప్, ప్రెసిడెంట్ బి.జయలక్ష్మి, అధ్యాపకులను అభినందిస్తూ సందేశం పంపించారు. విద్యాపరంగానే కాకుండా ఆలోచన, ప్రణాళిక, నిర్వహణా ప్రమాణాలను విద్యార్థుల్లో పెంపొందించేలా సీకాం బోధనా విధానాలు ఉన్నాయని సందేశంలో పేర్కొన్నారు.

సంపులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి సమీపంలోని టూరిజం అతిథి భవనం వెనుకనున్న సంప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అలిపిరి ఎస్ఐ అజిత ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండడంతో రెండుమూడు రోజుల క్రితం పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో పడిపోయి ఉండవచ్చునని, అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ గర్భాశయంలో 2.5 కేజీల గడ్డ తొలగింపు



మహిళకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 52 ఏళ్ల మహిళ గర్భాశయంలోని 2.5 కేజీల గడ్డను అరుదైన శస్త్ర చికిత్స ద్వారా తొలగించి ఆమె ప్రాణాలు నిలబెట్టామని మనోహరి రామచంద్ర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామచంద్ర తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని మనోహరి రామచంద్ర ఆస్పత్రిలో ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కొంతకాలంగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ మంగళవారం ఆస్పత్రికి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భాశయంలో ప్రమాదకరమైన పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే నిపుణులైన వైద్యుల సమక్షంలో శస్త్ర చికిత్స చేసి 2.5 కేజీల గడ్డను విజయవంతంగా తొలగించామని తెలిపారు. ప్రస్తుతం మహిళ కోలుకుందని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ హర్ష, డాక్టర్ మనోహరి, డాక్టర్ అచ్యుత పాల్గొన్నారు.

శ్రేష్ఠ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(విద్య),ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యుత్తమ ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎస్సీ బాలురు, బాలికలకు ప్రవేశం కల్పించేందుకు నిర్వహించే శ్రేష్ఠ-2025 పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్ష ద్వారా 3 వేలమంది విద్యార్థులకు 9, 11 తరగతుల్లో ప్రవేశం కల్పిస్తారని వివరించారు. జూన్ 1వ తేదీన ఈ పరీక్ష జరుగనుందని, ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 8688888802/03, 9399976999లలో సంప్రదించాలని కోరారు.

వెదురు సాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏపీఎం దాక్షాయని

భాకరాపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వెదురు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఎఫ్‌పీవో ఏపీఎం దాక్షాయణి అన్నారు. చిన్నగొట్టిగల్లు స్త్రీశక్తి భవన్‌లో మహిళా సమాఖ్య, సంఘమిత్రలు, ఎఫ్‌పీజీ సభ్యులకు వెదురు సాగు, తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి దానికి అనుగుణంగా వెదురు సాగుకు అనుకూలమో కాదో సిఫారసు చేస్తారన్నారు. వెదురు మూడు సంవత్సరాలకు కోతకు వస్తుందన్నారు. కాండంతో పాటు ఆకులు కూడా వివిధ రకాల వస్తువుల తయారీలో ఉపయోగిస్తారన్నారు. సాగు,మార్కెటింగ్,ఆదాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకంపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం స్వర్ణలత, కుసుమ కుమారి, శ్రీనివాస్, సీసీలు రామచంద్ర, శివశంకర్ రెడ్డి, నారాయణమూర్తి, ఎఫ్‌పీవో అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ డిప్యూటీ డెమో అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. మంచి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకోవాలన్నారు. మాంసాహారం బదులు శాఖాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమార్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సినీనటుడు సప్తగిరి తల్లికి ఎమ్మెల్యేల నివాళి


చిట్టెమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ కర్మక్రియలకు బుధవారం ఎమ్మెల్యేలు పులివర్తినాని, అమరనాథరెడ్డి, గురజాల జగన్మోహన్ హాజరయ్యారు. తిరుచానూరులోని ప్రైవేట్ పంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నాయకులు పాల్గొన్నారు.

పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న శోభన్‌బాబు,ఏపీఎం నాగేశ్వరరావు

తిరుపతి రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఆకాంక్షించారు. బుధవారం జరిగిన మండల వెలుగు మహిళాసమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళిక సర్వే జరుగుతోందన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, పీఎంవిశ్వకర్మ వంటి పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఆరోగ్య, పశుసంవర్ధక శాఖ అధికారులు, సీసీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక వేడుక

తిరుపతి రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని బుధవారం రాముల వారి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రామనామ స్మరణల నడుమ వేదపండితులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి ఊరేగింపులో మహిళలు కర్పూరహారతులు పట్టి మొక్కుచెల్లించారు. సర్పంచ్ విడుదల రవికుమార్ రెడ్డి దంపతుల నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ఎంపీపీ విడుదల మాధవరెడ్డి హాజరయ్యారు. అన్నదానసేవని నిర్వహించారు. గోపాల్‌రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, మహేష్, కిరణ్, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలని మంత్రులకు వినతి


దేవాదాయ మంత్రితో భక్తవత్సలంనాయుడు

రామచంద్రాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రులను కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన కొడవకంటి భక్తవత్సలం నాయుడు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రులు లోకేష్, గొట్టిపాటి రవి కుమార్, రాంప్రసాద్‌రెడ్డిఆనం రామనారాయణరెడ్డిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనుపల్లి, కమ్మకండ్రిగ గ్రామాలకు బస్సు సర్వీసులను కొనసాగించాలని మంత్రి రాంప్రసాదరెడ్డిని కోరినట్లు భక్తవత్సలం నాయుడతెలిపారు. కట్ట వద్ద జలంకంతేశ్వరస్వామి ఆలయాభివృద్ధితోపాటు 108 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని దేవదాయ మంత్రిని కోరామన్నారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్‌డే


సర్టిఫికెట్ అందిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): నలంద నగర్‌లోని సాయిసుధా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసిన చిన్నారులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి సర్టిఫికెట్లని అందుకున్నారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి అమ్మచేతివంటని తినాలని పిల్లలకు హితవు పలికారు. 22మంది విద్యార్థులకు పట్టాలను అందించి అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ పి.వెంకటకృష్ణ, టీచర్లు రాము, సాయి నాగేష్, వనిత, శారద, రాధ, శైలజ, భువనేశ్వరి, జయంతి, ఆసిఫా, శకుంతల, లక్ష్మీ, రేఖ, రేవతి, భార్గవి, శోభ, పుష్ప పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు బీఆర్ నాయుడి పరామర్శ



తిరుపతి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కందాటి శంకర్‌రెడ్డి నివాసానికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకర్‌రెడ్డి తనకు మంచి మిత్రుడంటూ ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అక్కడ ఉన్న ఆయన అనుచరులతో మాట్లాడారు. కందాటి సురేష్ రెడ్డి, కందాటి మిథున్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, మాజీ కౌన్సిలర్ జెడబ్ల్యు విజయ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు చల్లా, షణ్ముగం, పల్లా సత్యవతి, ఎమ్మార్ పల్లి సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాకాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి వెబ్‌సైట్ ఓపెన్ అయింది. రుణాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో అరుణ కోరారు. బీపీఎల్ కేటగిరి, ఎస్సీ కులానికి చెందిన 21-50 మధ్య గల వయసున్నవారు అర్హులన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా సచివాలయాలకు వెళ్లి మే 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తిరుమలకు కాలినడకన 'అక్కడ అమ్మాయి-ఇక్కడ అబ్బాయి'


కాలినడకమార్గంలో చిత్రబృందం

తిరుమల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): 'అక్కడ అమ్మాయి-ఇక్కడ అబ్బాయి' చిత్ర బృందం కాలినడకన బుధవారం రాత్రి తిరుమలకు చేరుకుంది. హీరో ప్రదీప్ మాచిరాజు, దీపిక పిల్లి, చిత్ర బృందం సభ్యులు కలిసి అలిపిరి కాలినడకమార్గం ద్వారా తిరుమలకు చేరుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే



తిరుమల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. **తిరుచానూరు:** పద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి రక్షా నిఖిత్ ఖడ్సే, రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తిలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై దృష్టి సారించండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని టాటా క్యాన్సర్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ సూచించారు. తిరుపతి గాలివీధి రాస్ క్లస్టర్ ప్రాంగణంలో బుధవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు టాటా ట్రస్ట్ వారు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆహార సూత్రాలు పాటించాలని, క్యాన్సర్ వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే నయం చేయవచ్చునన్నారు. 120 మందికి పరీక్షలు నిర్వహించారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయండి

తిరుపతి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి) : కొర్లగుంట బైపాస్ రోడ్డులో ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం స్కావెంజర్స్ కాలనీ, కొర్లగుంట సర్కిల్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణం, రోడ్ల గుంతలు పూడ్చే పనులను కార్పొరేటర్ దూది కుమారి, హెల్త్, ఇంజినీరింగ్, అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. స్కావెంజర్స్ కాలనీలో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు.

అజాత శత్రువు కృష్ణమనాయుడు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ పాఠశాలలో సుదీర్ఘ కాలంగా పిల్లలకు చదువులు నేర్పిన కృష్ణమనాయుడు అజాతశత్రువని ఎమ్మెల్యే నాని కొనియాడారు. కృష్ణమనాయుడు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగ ధర్మమే కాదు.. పలు సేవా కార్యక్రమాలు చేయడం ఆయన మంచితనానికి నిదర్శనమన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ఇవ్వడం ముదావహమన్నారు. అనంతరం కృష్ణమనాయుడు దంపతులను శాలువకప్పి ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కేశవులనాయుడు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు హాజరై సత్కరించారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను అమల్లోకి తెచ్చి ప్రభుత్వం 210 సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జీవి నారాయణరెడ్డి, అధికారులు పీవీ జగదీష్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో మరిన్ని ప్రాంతాలకు తాగునీరు

●రూ.12.50 లక్షలతో తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ


పైప్‌లైన్ పనులకు భూమిపూజ

చంద్రగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో మరిన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు అడుగులు పడుతున్నాయి. రూ.12.50 లక్షలతో ఇందుకోసం తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. దోర్నకంబాల పంచాయతీలోని మొండికాలువ నుంచి తాగునీటి సరఫరా జరిగేది. అయితే పట్టణంలోని పాతపేట లైబ్రరీ నుంచి అక్కగార్ల కాలనీ, వికలాంగుల కాలనీ, సప్తగిరి కాలనీ, టీడీకాలనీ వాసులకు తాగునీరు అందేది కాదు. అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులు ఈసమస్య తీవ్రతను ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకున్నారు. రూ.12.50 లక్షలు మంజూరుకు కృషి చేశారు. ఈక్రమంలో బుధవారం స్థానిక సర్పంచ్ రూపారామ్మూర్తి, టీడీపీ నాయకుడు మంగాపురం భాస్కర్‌లు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ తీసుకున్నందుకు ఆనందం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే నాని,టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ కమిటీలకు చైర్మన్ల నియామకం


గౌస్‌బాషా- సుధాకరయ్య

చంద్రగిరి, పాకాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, పాకాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ (ఏఎంసీ)లకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఛైర్మన్లను ప్రకటించింది. చంద్రగిరి ఏఎంసీ ఛైర్మన్‌గా ఆ మండల టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషాను నియమితులయ్యారు. ఈ మార్కెట్ యార్డు పరిధిలో చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాలు ఉన్నాయి. ఈసందర్భంగా గౌస్‌బాషా మాట్లాడుతూ తనను ఛైర్మన్‌గా ప్రకటించినందుకు ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. పాకాల ఏఎంసీ ఛైర్మన్‌గా విశ్రాంత తహసీల్దార్, టీడీపీ నాయకుడు కాణిపాకం సుధాకరయ్య నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించి తక్కువ సాగుఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించేలా కృషిచేస్తామన్నారు. తనను ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే నాని, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్, మండల కూటమి నాయకులు, దళిత సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

భూమన దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

●రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్


మాట్లాడుతున్న సీఆర్‌రాజన్

తిరుచానూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీటీడీపై మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్ హితవు పలికారు. బుధవారం తిరుచానూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పవిత్రమైన టీటీడీని వైసీపీ భ్రష్టు పట్టించిందన్నారు. టీటీడీ గోశాలలో అనారోగ్యంతో పదుల సంఖ్యలో గోవులుమరణిస్తే కరుణాకర్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. గోవులు లేనప్పటికీ నిర్వహణ ఖర్చు పేరుతో రూ.1.78కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. సమావేశంలో మునిరత్నంరెడ్డి, జయచంద్ర నాయుడు, బాలు పాల్గొన్నారు.

రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్ల రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో మొబైల్ హంట్, సీఇఐఆర్ పోర్టల్ ద్వారా రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే మొబైల్ హంట్ వాట్సాప్ 9490617873 ద్వారా సీఇఐఆర్ పోర్టల్‌కు సమాచారమివ్వాలన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు 12 విడతల్లో రూ.7.56 కోట్ల విలువచేసే 4,275 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సెల్‌ఫోన్లు అమ్మడానికి వస్తే దుకాణదారులు బిల్లులు పరిశీలించాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరచిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

తిరుమలలో ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్


సత్యనారాయణమూర్తి

తిరుమల, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య న్యాయ విచారణ కమిషన్ ఛైర్మన్, ఇతర అధికారులతో కలిసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కమిషన్ ఛైర్మన్ సత్యనారాయణమూర్తి, సెక్రటరీ, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, లైజన్ ఆఫీసర్ రూప్‌చంద్, ఇతర అధికారులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానికి వెళ్లే ముందు వీరు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో సర్వదర్శన భక్తుల క్యూలైన్లు, కంపార్టుమెంట్లను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. వీరు గత నెల 15, 16వ తేదీల్లో తిరుమలలోని క్యూలైన్లు, కంపార్టుమెంట్లు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించిన సంగతి తెలిసిందే.

హోమ్‌స్టేల మూల్యాంకన సమర్పణ


కలెక్టర్‌కు ప్రాజెక్టు నివేదిక అందజేస్తున్న నీరజ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో హోమ్‌స్టేలను స్థాపించడానికి ప్రతిపాదిత విధానంతో పాటు తిరుపతి జిల్లాలోని హోమ్‌స్టేలపై మూల్యాంకన నివేదికను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎం.నీరజ, ప్రొఫెసర్ గౌతమి సమర్పించారు.. పర్యాటక విధానాన్ని మార్గనిర్దేశం చేయడం, సందర్శకుల అనుభవాలను మెరుగుపరచడం, హోమ్‌స్టేల ద్వారా స్థిరమైన, కమ్యూనిటీ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ఈ నివేదిక లక్ష్యమని కలెక్టర్ అన్నారు. ఏపీటీడీసీ ఈడీ రమణ ప్రసాద్ పాల్గొన్నారు.

కళాకారులకు పురస్కారాలు



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని తిరుపతికి చెందిన ముగ్గురు కళాకారులు కందుకూరి పురస్కారాలు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వివేక్ పత్తిపాటి, శాంబోలు హరినాథ్, నెల్లూరు కృష్ణమూర్తి పురస్కారాలు అందుకున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో రెండో రోజు బుధవారం జాతర వైభవంగా నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ధూప,దీప, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఎదుట పోతురాజు ముగ్గువేసి శాంతిపూజలు నిర్వహించారు

మహిళా పోలీసు స్టేషన్‌కు ఏసీ వితరణ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్, జిల్లా పోలీస్ సంఘం జాయింట్ సెక్రెటరీ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ గౌరవ సలహాదారు అయిన జి. శంకర్‌రెడ్డి బుధవారం స్టేషన్‌కు ఏసీ వితరణ చేశారు. తన పెద్ద కుమారుడు చరణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా డీఎస్పీ శ్రీలతకు అందించారు. చరణ్‌కు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'పల్లా' చాలెంజ్‌ను స్వీకరిస్తున్నా: భూమన

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చాలా ఆవేదనతోనూ, ఆవేశంతోనూ రేపు గోవులపరిస్థితి చూద్దాం అంటూ చాలెంజ్ విసరడాన్ని స్వీకరిస్తున్నానంటూ టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10గంటలకు గోశాలలో కలుద్దామంటూ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 27 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 27 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. డీఎస్పీ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

ట్రాఫిక్ సమస్యపై పోలీసుల దృష్టి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యపై ఈస్ట్ పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐలు కలిసి పుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను పరిశీలించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని ఆదేశించారు. శ్రీనివాసం ఎదుట వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకున్నారు.

కుట్టు శిక్షణకు విశేష స్పందన

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కార్పొరేషన్ సహకారంతో మంగళం పరిధిలోని రణదీరపురం గ్రామ సచివాలయ ప్రాంగణంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 9న ప్రారంభమైన శిక్షణలో దాదాపు వందమంది పాల్గొంటున్నారు.

పద్మావతి వర్సిటీలో ఐఎస్‌వో బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీని ఐఎస్ఓ బృందం సందర్శించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం యూనివర్సిటీకి చేరుకుంది. ఉన్నతాధికారులతో సమావేశమైంది. యూనివర్సిటీ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల ప్రగతి, ప్రమాణాలను వీసీ వెన్నం ఉమ వివరించారు. రిజిస్ట్రార్ ఎస్.రజని, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టర్ టి.త్రిపురసుందరితో పాటు ఐఎస్ఓ ఎండీ ఆలపాటి శివయ్య యూనివర్సిటీలోని పలు కాలేజీలు, హాస్టళ్లు, గ్రంథాలయం, హెల్త్ సెంటర్, విభాగాలను పరిశీలించారు.

రుయాలో కోత, కుట్లు లేకుండా వెన్నెముక శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోత, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో అరుదైన వెన్నెముక శస్త్ర చికిత్సను రుయాస్పత్రిలో చేసినట్లు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. రుయాస్పత్రిలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పెళ్లకూరు మండలం దిగువచావలికి చెందిన ప్రేమానంద్(74) చాలాకాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడని, పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో రుయాస్పత్రికి వచ్చాడని తెలిపారు. వైద్యులు పరీక్షించి వెన్నెముక దెబ్బతిన్నట్లు గుర్తించారన్నారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి నాగరాజు నేతృత్వంలో డాక్టర్ అనంత కిరణ్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, డాక్టర్ రాధ సహకారంతో కోత, కుట్లు లేకుండా అపర్క్యుటేనియస్ వర్టిబ్రోప్లాస్టి పద్ధతిలో విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేసినట్లు చెప్పారు. బాధితుడు పూర్తిగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

మనస్తాపంతో ప్రైవేటు స్కూల్ పూర్వ ప్రిన్సిపాల్ ఆత్మహత్య


శ్రీవాణి ఫైల్‌ఫొటో

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఒకవైపు అనారోగ్యంతో బాధపడుతున్న భర్త.. మరోవైపు ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపాల్ నుంచి తొలగించారనే మనస్తాపంతో రత్నాకరం శ్రీవాణి (45) ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. శ్రీనివాసపురం కాలనీలోని శ్రీవాణి రెండేళ్లుగా తిరుపతిలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఈమె భర్త సురేంద్రనాథ్‌కు కొన్ని నెలల క్రితం లివర్ సంబంధ అనారోగ్య సమస్యలు తలెత్తాయి. అతడు కోడూరులోని ఎల్ఐసీ కార్యాలయంలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు విదేశాల్లో ఉద్యోగి. భార్యాభర్తలే ఉంటున్నారు. నెల కిందట ఆమెను ప్రిన్సిపాల్‌గా తొలగించారు. ఈ క్రమంలో డ్యూటీ నిమిత్తం కోడూరుకు వెళ్లిన సురేంద్రనాథ్ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి రాగా తలుపులు తీయలేద. కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు చీరతో శ్రీవాణి ఉరివేసుకుని ఉంది. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లగా ఆమె మృతి చెందింది. తన అనారోగ్యంతోపాటు ప్రిన్సిపాల్‌గా తొలగించారనే ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సురేంద్రనాథ్ ఫిర్యాదు చేవారు. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు



రేణిగుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట, కడప మార్గంలోని గోతులను నేషనల్ హైవే అధికారులు పూడ్చుతున్నారు. గోతులు తారుతో పూడ్చేందుకు రూ.2 కోట్లు విడుదల కాగా సంబంధిత అధికారులు పనులు చేపడుతున్నారు. బుధవారం కొత్త చెక్ పోస్ట్ కూడలి సమీపంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

టెండర్లు పిలవకుండానే
పనులెలా కట్టబెడతారు?

- గ్రామసభలో నిలదీసిన పార్టీల నాయకులు



పంచాయతీ కార్యదర్శి, సర్పంచిని నిలదీస్తున్న నాయకులు

రేణిగుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో టెండర్లు పిలవకుండా లక్షల రూపాయల విలువైన పనులను ఎలా కట్టబెడతారంటూ పలు పార్టీల నాయకులు సర్పంచు నగేశ్‌ను నిల దీశారు. బుధవారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఇటీవల పంచాయతీలో నిర్వహించిన వేలంలో రుసుము చెల్లించకుండా పనులను కాంట్రాక్టర్లకు ఎలా కట్టబెడుతారంటూ జనసేన, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యదర్శి మణిని నిలదీశారు. భాస్కర్, భాగ్యలక్ష్మి, జగదీష్, మోహన్, రావణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేదాలు వల్లిస్తున్న వైసీపీ దెయ్యాలు

మండిపడ్డ ఎమ్మెల్యే సుధీర్



మీడియాతో మాట్లాడుతున్న సుధీర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసీపీ దెయ్యాలు గోశాల పేరుతో వేదాలు వల్లిస్తున్నాయని ఎమ్మెల్యే సుధీర్ ఎద్దేవా చేశారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో బుధవారం టీటీడీ గోశాలపై మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో మండిపడ్డారు. నాస్తికుడైన కరుణాకర రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పవిత్రమైన లడ్డూప్రసాదాన్ని కల్తీ చేయడంపై విచారణ జరుగుతోందన్నారు. దాన్నుంచి ప్రజలను దృష్టి మళ్లించేందుకు కరుణాకరరెడ్డి ప్రస్తుతం టీటీడీ గోశాలలో ఆవులు చనిపోతున్నాయంటూ తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. హిందువులు ఆరాధించే గోవులపై అసత్య ప్రచారాలు చేస్తే శ్రీవారు క్షమించరని హితవు పలికారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర రెడ్డి గోశాలలో సిబ్బంది సంఖ్యను ఎక్కువగా చూపి జీతాలు స్వాహా చేశారని, గోవులకు ఇచ్చే మందులు, గడ్డి పేరుతో పెద్దస్కాంకు పాల్పడ్డారన్నారు. వెంట్రుకలనుకూడా వదలకుండా ఆదాయమే ధ్యేయంగా వైసీపీ పాలకులు అక్రమార్జన చేశారని చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలోని అటవీభూముల్లో రూ.750కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో గోశాల పెడుతున్నట్లు స్వాహా చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. దీనిపై కూడా త్వరలో విచారణ జరుగుతుందని చెప్పారు. ఇక గత ప్రభుత్వంలో టీటీడీ గోశాలలో విజిలెన్సు తనిఖీల కోసం ఎన్నిసార్లు అనుమతించారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గోశాలనువంచి పెద్దఎత్తున పాలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పదినెలల్లోనే అభివృద్ధిలో దూసుకుపోతూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకుందన్నారు. ఇది ఓర్వలేక వైసీపీ నాయకులు సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త చట్టాలు తీసుకురావాలని తాను రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాన్నారు. సీఎం చంద్రబాబు సౌమ్యమైన వ్యక్తిత్వాన్ని వైసీపీ వారు చేతకానితనంగా చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వసంతోత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీవీధిలో కావమ్మ ఆలయం ఆవరణలో కొలువై ఉన్న శ్రీరామ మందిరంలో గురువారం వసంతోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. నవమి ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో ఉదయం వసంతోత్సవం నిర్వహించి మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.



వెలుగు రుణాల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న సంఘ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసలపల్లి వెలుగులో ఓటీఎస్ కోసం తీసుకున్న రుణాలు దుర్వినియోగమయ్యాయని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావుకు స్వయం సహాయక సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో ఓటీఎస్ కోసం చెంగాళమ్మ, సాయిబాబా, భాగ్యలక్ష్మి గ్రూపుకు ముగ్గురు చొప్పున 9 మంది ఒక్కొక్కరు రూ.10వేలు రుణాలను తీసుకున్నారని తెలిపారు. అయితే గతంలో పనిచేసిన సీసీ, సంఘమిత్ర కలసి ఒక్కో గ్రూపులోని ఆరుగురు సభ్యులకు తెలియకుండా రూ.60వేల రుణాన్ని తీసుకున్నారని చెప్పారు. 9 మంది సభ్యులు రుణాన్ని తిరిగి చెల్లించేరన్నారు. రెండు రోజులు క్రితం రుణాల కోసం బ్యాంకు వెళితే ఒక్కో గ్రూపు సభ్యులు ఇంకా రూ. 30వేల రుణం, రూ.12వేలు వడ్డీ కట్టాలని, మూడు గ్రూపులకు సంబంధించి రూ. 1.28లక్షలు కట్టాలని బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. ఓటీఎస్ రుణంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో పని చేసిన సీసీ, సంఘమిత్రను పిలిపించి విచారణ జరిపి న్యాయం చేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

జాతరో.. జాతర



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ - పోతురాజు ముగ్గు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో రెండో రోజు బుధవారం జాతర వైభవంగా నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ధూప,దీప, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఎదుట పోతురాజు ముగ్గువేసి శాంతిపూజలు నిర్వహించారు. యాదవ కులస్తులు కొలుపు చేశారు. ఈవో బాపిరెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. రాత్రి 7గంటలకు రేణుకాదేవి ముగ్గు, కుంభం నిర్వహించారు. ఈనెల 17న గురువారం సాయంత్రం ముత్యాలమ్మ పురవీధుల్లో ఊరేగనున్నారు.

ఐదేళ్ల తర్వాత 'పల్లెవెలుగు' ప్రారంభం

రేణిగుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత ఎస్‌యు పురానికి పల్లె వెలుగు బస్సు సర్వీసు బుధవారం ప్రారంభమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్లెవెలుగు బస్సును రద్దు చేశారు. ఈ విషయమై గ్రామస్తులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం బస్సు సర్వీసును ఆర్టీసి అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఏవో పిచ్చిరెడ్డి, బీసీ కార్పొరేషన్ సభ్యుడు చిన్నారెడ్డి, మునుస్వామి నాయుడు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో గుడిసెల దగ్ధం

భూస్వాములే కాల్చారని బాధితుల ఫిర్యాదు

సత్యవేడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరడం గిరిజన కాలనీలో రెండు గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన మేకల రామయ్య, మేకల రాణి కుటుంబాలు కూలీ పనుల నిమిత్తం నాలుగు రోజుల క్రితం చెన్నై పరిసర ప్రాంతాల్లోని పెరియపాళెంకు వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున వీరిద్దరు ఇళ్ల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి గుడిసెలు కాలి బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పివేశారు. అయితే ఈ అగ్ని ప్రమాదానికి గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులే కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో గిరిజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ప్రభుత్వ భూమికి సంబంధించి గిరిజనులు, పెత్తందారులకు మధ్య స్థల వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా తమ ఇళ్లకు నిప్పుపెట్టారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన నలుగురిపై అనుమానం వ్యక్తం చేస్తూ సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, రమేష్ గిరిజన కాలనీలో కాలిన గుడిసెలను పరిశీలించారు. గిరిజనుల ఇళ్లను తగుల బెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే సుధీర్ దుస్తులను పంపిణీ చేశారు. కమిషనర్ గిరికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకుడు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయ్యగుంటలో భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారులు రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామసభలో తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ... సర్వే జరిగే సమయంలో రైతులు భూ రికార్డులతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, సర్వేయరు రాజ్‌కుమార్, ఆర్ఐ నల్లయ్య, సచివాలయ సర్వేర్లు, రైతులు పాల్గొన్నారు

వసతులు కల్పించండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న బంకులను పురపాలకసంఘ అధికారులు తొలగించి ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేశారని... అయితే అక్కడ వసతులు కల్పించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య కోరారు. ఈ మేరకు బుధవారం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందించారు. కలిసి వినతిపత్రం అందజేశారు. గురవయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి ఎదురుగా బంకులను ఏర్పాటు చేసి మూడు నెలలు అవుతన్నా ఇప్పటి వరకు కరెంటు, నీటి వసతి కల్పించలేదన్నారు. పదిరోజుల్లో మౌలిక వసతులు కల్పించకపోతే తిరిగి మార్కెట్ వద్దకు తరలిస్తామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి గోపి, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐటీయూసీ నాయకుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచడం ఏమనగా నా క్లయింటు దొమ్మరాజు పద్మనాథ రాజు, తండ్రి: లేటు డి.సుబ్బరాజు, కీళపూడి గ్రామం, పిచ్చాటూరు పోస్టు & మండలం, తిరుపతి జిల్లా అను వారు శ్రీకాళహస్తి గౌరవ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు నందు దావా నెంబర్ 20/2018 వేసి క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపైన, ప్రతివాదులైన 1) పోలిశెట్టి రమేష్ బాబు, తండ్రి: లేటు పి.సుబ్రమణ్యం శెట్టి, 2) పోలిశెట్టి సురేష్‌బాబు, తండ్రి: లేటు పి.సుబ్రమణ్యం శెట్టి పైన తేది.28.01.2025 నాడు డిక్రీ మరియు జడ్జిమెంట్ పొందియున్నారు. నా క్లయింటు కోర్టు వారి ఆదేశాల మేరకు 10.02.2025 తేదీన బ్యాలెన్స్ కొనుగోలు అమౌంట్‌ను కూడా పై తెలిపిన కోర్టు నందు డిపాజిట్ చేసియున్నారు. కావున పై తెలిపిన ప్రతివాదులు కోర్టు డిక్రీ, జడ్జిమెంట్ మేరకు నా క్లయింటు పేరుతో దావా షెడ్యూల్ దాఖలా ఆస్తిని రిజిష్టర్ చేసి ఇవ్వవలయును. లేనియెడల నా క్లయింటు చట్ట ప్రకారం రిజిష్టర్ పొందగలరు. పై తెలిపిన అన్ని విషయాలను ప్రతివాదులు దాచిపెట్టి మూడవ పార్టీలకు అమ్మచూపుచున్నారని తెలిసి, ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియపరచడం ఏమనగా, సదరు షెడ్యూల్ దాఖలా ఆస్థిపై నా క్లయింట్ దొమ్మరాజు పద్మనాథ రాజు,తప్ప ఎవరికిని ఎలాంటి హక్కులు రావని మరియు సదరు షెడ్యూల్ ఆస్థిపై ఎలాంటి కొనుగోళ్ళు అమ్మకాలు చేసిననూ చెల్లనేరవు. అట్లు ఎలాంటి లావాదేవీలు జరిపినా, నా క్లయింటుకు సదరు పత్రాలు వర్తించవని మరియు నా క్లయింటు తీసుకొనపోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరిక చేయుచున్నాను.

షెడ్యూల్

పూర్వం చిత్తూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, శ్రీబాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా తిరుపతి, పిచ్చాటూరు సబ్ డిస్ట్రిక్టు, పిచ్చాటూరు మండలం, నెం.207రు॥ పిచ్చాటూరు గ్రామ లెక్క దాఖలాలో పుంజ సర్వే నెం.273-2ఎ, 274-1లో బజారు వీధి, ఇంటి నెంబర్ 3-120లో గల ఇంటి ఖాళీ జాగా మరియు ఆర్‌సిసి మోల్డింగ్ మిద్దె ఇల్లుకు హద్దులు: తూర్పు: పార్థసారధి ఇల్లు, దక్షిణం: సంధు వీధి, పడమర: కె.వాసు ఇల్లు, ఉత్తరం: తిరుపతి-చెన్నై రోడ్డు. ఈ మధ్య గల ఇంటి ఖాళీ జాగా కొలతలు: తూర్పు-పడమర: 35 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 83 అడుగులు ఖాళీ జాగాలో కట్టియుండు ఆర్‌సిసి మిద్దె ఇల్లులో బాడుగకు ఉండు షాప్ రూము మరియు ఆంధ్రా బ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ కొలతలు: తూర్పు-పడమర: 31 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 74 అడుగులు

1వ అంతస్తులో కట్టియుండు ఆర్‌సిసి అంగడి రూము ఇల్లు కొలతలు: తూర్పు-పడమర: 31 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 74 అడుగులు కరెంటు సర్వీసు నెంబర్: 13,18,1274,1624, 83 తో సహా ఈ ఆస్థి మాత్రం.

సం/- **ఎ.సుధాకర్,** బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్,
గోపాలవనం, శ్రీకాళహస్తి-517 644,
సెల్: 94404 25335



పుత్తూరు వార్తలు

సదాశివా... శివరాత్రి జమాఖర్చుల లెక్క తేలేనా?



వడమాలపేట, 16 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సదాశివ కోన సదాశివేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా వచ్చిన ఆదాయానికి సంబంధించి జమా ఖర్చుల వివరాలు గోప్యంగా ఉంచడంపై భక్తుల్లో పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని సదాశివకోనలో ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా రూ.11.26 లక్షలు వచ్చినట్లుగా అధికారులు ప్రకటించారు. గతంలో శివరాత్రి తరువాత రెండ్రోజుల్లో వడమాలపేటలో సదాశివకోన శివభక్త బృందం, పాలకవర్గం సమక్షంలో ఆదాయం, ఖర్చులు బహిరంగ పరిచి, తదుపరి మిగిలిన మొత్తాన్ని స్థానిక బ్యాంక్‌లో సదాశివకోన ఖాతాలో జమ చేసేవారు. అయితే ఈ సారి ప్రభుత్వం ఇంకా పాలకవర్గం ప్రకటించలేదు. దీంతో ఎండోమెంట్ అధికారులు భక్తుల సమక్షంలో లెక్కలు బహిరంగ పరచాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు అధికారులు ఎలాంటి సమాచారం తెలపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా గత సంవత్సరం శివరాత్రి లెక్కలను అప్పటి ఈవో రామచంద్రారెడ్డి ఖర్చులు హెచ్చుగా చూపారు. సుమారుగా రూ.4లక్షల మేరకు అవినీతి జరిగినట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. గత సంవత్సరం రూ13.26 లక్షలు ఆదాయం రాగా రూ.10.31 లక్షలను ఖర్చుగా చూపారు. దీంతో భక్తులు జమాఖర్చులను తేల్చాల్సిందిగా ఎండోమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోగా గత ఈవోను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. కాగా ఈ ఏడు శివరాత్రి జమాఖర్చులను దేవదాయ, ధర్మాదాయ అధికారులు ఏ విధంగా ప్రకటిస్తారో అని భక్తులు ఎదురు చూస్తున్నారు.

టీటీడీ గోశాలను తనిఖీ చేసుకోండి

- జగన్ ముఠాకి ఎమ్మెల్యే భానుప్రకాష్ సవాల్
- గతంలో జరిగిన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): టీటీడీలో గత ప్రభుత్వ హయాంలో జరిగతిన దారుణాలను కప్పిపుచ్చుకునేందుకు నిరాధారమైన ఆరోపణలకు దిగుతున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఇప్పటికే టీటీడీ సమూల ప్రక్షాళనకు చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. ఇందులో భాగంగానే భూమన కరుణాకర రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. లేని గోవులను ఉన్నట్లుగా లెక్కలు చూపి బొక్కేశారన్నారు. గోవులు మరణించిన లెక్కలు బయటకు రాకుండా తొక్కి పెట్టారని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గోశాలలో జరిగిన ఘోరాలు అన్నీఇన్నీ కావన్నారు. గత వైసీపీ హయాంలో టీటీడీలో జరిగిన పాలనకు నేటి ప్రభుత్వంలో సాగుతున్న పాలనకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. భక్తులను పలకరిస్తే ఈ విషయం తెలుస్తుందన్నారు. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడిందన్నారు. తిరుపతి ఎస్వీ గోశాల, పలమనేరు, కమలయ్యగారిపల్లిలో 2022లో పది నెలల కాలంలో 60 ఆవులు, దూడలు మృత్యువాతపడ్డాయని గుర్తు చేశారు. నాడు గోశాలలో పురుగులతో కూడిన దాణా, నాణ్యతలేని మందుల వినియోగమే కాకుండా, గడ్డి కొనుగోలులో కూడా ప్రమాణాలు పాటించలేదని విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. కల్తీ నెయ్యిని శ్రీవారి నైవేద్యానికి వినియోగించి పాపం చేశారన్నారు. టీటీడీ పాలన, శ్రీవారి సేవల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే అటు భక్తులు, శ్రీవారు క్షమించరని హితవుపలికారు. భక్తులకు నాణ్యమైన సేవలే లక్ష్యంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రుచికరమైన అన్నప్రసాదాలతో పాటు నాణ్యమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా.. వంట గదిలో జాగ్రత్త



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహిళలకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పుత్తూరు ఫైర్ ఆఫీసర్ నేతాజీ అవగాహన కల్పించారు. మహిళలు ప్రధానంగా వంటగదిలో వంట చేసే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని సూచించారు. సిలిండర్‌కు నిప్పు అంటుకుంటే ఎలా నియంత్రించాలన్న అంశాన్ని అగ్ని మాపక సిబ్బంది చేసి చూపారు.

నేడు పాలిసెట్ దరఖాస్తుకు ఆఖరు

పుత్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువును 17వ తేదీ వరకు పొడిగించారని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. ఈ నెల 30న జరిగే ఈ ప్రవేశ పరీక్ష మీద విద్యార్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థుల విజయానికి కెరీర్ సంసిద్ధత అవసరం

పుత్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వృత్తి, ఉద్యోగాల్లో విజయం సాధించాలంటే విద్యార్థులకు తప్పని సరిగా కెరీర్ సంసిద్ధత అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో కెరీర్ సంసిద్ధ అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా విజయం సాధించే మెలకువలను ప్రైవేట్ సంస్థ మేనేజర్ శ్రుతి వివరించారు,

ఆయిల్‌పాం నర్సరీ తనిఖీ

పిచ్చాటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి సమీపంలో ఉన్న త్రీ ఎఫ్ ఆయిల్ పాం నర్సరీని బుధవారం జిల్లా ఉద్యాన వన శాఖ అధికారులు దశరథ రామిరెడ్డి, రాధారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆయిల్‌పాం తోటలకు బిందుసేద్యం ఏర్పాటు చేసేందుకు మైక్రో ఇరిగేషన్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో గౌరిప్రియ, వీహెచ్ఏ అంజలి, ఏజీఎం మురళి, క్లస్టర్ అధికారి వెంకటముని, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపు వద్ద కత్తితో యువకుల వీరంగం

నలుగురికి గాయాలు ● ఇద్దరు పరారు

సత్యవేడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మద్యంషాపు వద్ద ఇద్దరు యువకులు కత్తితో వీరంగం చేశారు. ఈ సంఘటన సత్యవేడు పట్టణంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... చెన్నైకు చెందిన ఇద్దరు యువకులు స్థానిక చెన్నై మార్గంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం తాగుతుండగా పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడకు చేరుకుని చెన్నై యువకులను డబ్బులివ్వాలని బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో చెన్నై, సత్యవేడు యువకులకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో చెన్నై యువకులపై కత్తితో దాడి చేసినట్లు సమాచారం. చెన్నై యువకులు కూడా దాడిని ప్రతిఘటించి అదే కత్తిని లాక్కుని సత్యవేడు యువకులపై తిరగబడ్డారు. ఈ పరస్పర దాడిలో చెన్నై, సత్యవేడు యువకుడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సత్యవేడు యువకులను ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే చెన్నై యువకులు గాయాలతో పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చెన్నై యువకులకోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆలయంలో చోరీ

సత్యవేడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి రూ.1.50 లక్షల విలువైన వస్తువులు, హుండీలో నగదు అపహరించుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇనుప రాడ్లతో గ్రిల్‌గేట్లను పగులగొట్టి లోనికి ప్రవేశించి, ఆలయంలోని పంచహారతులు, దీప స్తంభాలు, కుంభ హారతి, ఆరు రాగి బిందెలు, వెండి కవచం, శఠగోపంతో పాటు హుండీని ధ్వంసం చేసి నగదును దొంగిలించుకుని పోయారన్నారు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశామన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రివర్స్ గేర్‌లో సూళ్లూరుపేట డిపో

గ్రామాల గడప తొక్కని పల్లె వెలుగులు ● రూ.9 కోట్ల మేర నష్టాల బాటలో పయనం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులోని సూళ్లూరుపేట డిపో రివర్స్ గేర్‌లో పయనిస్తోంది. డిపోను ఆదాయ మార్గాల్లో నడిపించాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమిత మవడంతో పాలన పూర్తిగా గాడితప్పింది. ఒకప్పుడు ఆదాయార్జనలో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన సూళ్లూరుపేట డిపో నేడు ఏకంగా రూ.9 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకొంది.

నాడు 54 సర్వీసులతో ప్రారంభం..

ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోను 1999 ఏప్రిల్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అప్పట్లో 54 సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడిపారు. తొలి నాళ్లలో ప్రయాణికుల నుంచి ఆదరణ లభించంతో డిపో లాభాలబాటలో నడిచింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. అధికారులు, సిబ్బంది వైసీపీ నాయకులతో అంటకాగి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రాబడితో సంబంధం లేకుండా టీడీపీకి అనుకూలమైన గ్రామాలన్న ముద్రవేసి బస్సులను రద్దు చేశారు. ప్రస్తుతం డిపో పరిధిలో కేవలం 35 సర్వీసులు మాత్రమే ఉన్నాయి.

సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతికి 12 ఆర్డినరి బస్సులు, నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు నడిపేవారు. మూడేళ్ల ఏళ్ల కింద ఆర్డినరి బస్సుల స్థానంలో ఎక్స్‌ప్రెస్‌లు ప్రవేశపెట్టారు. అలాగే రెండేళ్ల కిందట తిరుపతికి పది అద్దె బస్సులను ప్రారంభించగా అవి ఆరు నెలలు కూడా తిరగలేదు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ సర్వీసులు నడపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా బాగా రాబడి వచ్చే కోట మార్గంలో గంటకు ఒక సర్వీసు ఉండేది. ఇప్పుడు బస్సు వెళ్తుందో లేదో కూడా తెలియడం లేదు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు - చెన్నై నగరాలకు ఒక బస్సు కూడా లేకపోవడం శోచనీయం. అదే చెన్నై నుంచి నాయుడుపేట, నెల్లూరు వైపు తమిళనాడు బస్సులు పరుగులు తీస్తున్నాయి. శ్రీహరికోట - బెంగళూరు మధ్య కర్ణాటక ఆర్టీసీ రెండు ఐరావతి సర్వీసులను క్రమం తప్పకుండా నడుపుతోంది. అదే విధంగా సూళ్లూరుపేట నుంచి హైదరాబాద్, బెంగళూరు, కడప, శ్రీశైలం, మదనపల్లి, విజయవాడ, తిరుమలకు నడిపిస్తున్న బస్సులను పూర్తిగా రద్దు చేశారు. బస్సులు కావాలని విన్నపాలు ఉన్న పట్టించుకోలేదు.



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో గ్యారేజ్

సూళ్లూరుపేట నుంచి ఉచ్చూరు, కట్టువపల్లి, తుంగమడుగు, కారూరు, వాటంబేడు, ఎస్ఎం కండ్రిగ, కారిపాకం, సుగ్గుపల్లి, రామాపూరం, శ్రీహరికోట తదితర గ్రామీణ ప్రాంతాలకు బస్సులు తిరుగుతున్నట్లు అధికారులు రికార్డులో చూపుతూ ఆ సర్వీసులు ఇతర ప్రాంతాలకు నడుపుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలకూ దిక్కులేదు

ప్రభుత్వం మారాక డిపో బాగుపడుతుందని అందరూ భావించారు. అయితే అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి మారలేదు. మూడు నెలల క్రితం జిల్లా కలెక్టర్ మంగళంపాడు గ్రామానికి బస్సు నడపాలని ఆదేశాలిచ్చిన పట్టించుకోలేదు. ఇటీవల మాజీ మంత్రి పరసారత్నం తమ స్వగ్రామమైన గొట్టిప్రోలుకు బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినా ఫలితంలేదు. ఒక మాజీ మంత్రి, జిల్లా కలెక్టర్ మాటలకే దిక్కులేకపోతే సామాన్య ప్రజలకు డిపో అధికారులు ఏమి సమాధానం చెబుతారో ఇట్టే తెలుస్తోంది. ఇదిలా ఉండగా కొందరు సిబ్బంది తమ విధులను పక్కన బెట్టి సూపర్‌వైజర్లు, అధికారులుగా చెలామణి అవుతున్నారు. తరచూ బస్సులు రద్దు చేయడం పరిపాటిగా మారిపోయింది. కొన్ని సర్వీసులు షెడ్యూల్ ఒక మార్గం అయితే నడిపేది మరో మార్గంలో నడపుతున్నారు. ఈ విషయం తెలిసిన ఉన్నతాధికారులు తమకేమి పట్టనట్లు ఉంటున్నారు. డిపోలో లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ విభాగం నిద్రపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టిసారించి సూళ్లూరుపేట డిపో పూర్వ వైభవానికి చర్యలు తీసుకుకోవాల్సిన అవసరం ఉంది.





స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు - పుష్కరిణిలో వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా కోదండ రామాంజనేయస్వామి వసంతోత్సవం

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన ప్రార్థన, మహాలక్ష్మీ హోమం, బలిహరణ పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పుష్కరిణిలో వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చక్రస్నానం పూజలు జరిపారు. రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. ననిమేలు చంద్రశేఖరయ్య, వాణి, కృష్ణారావు, ఉమాదేవి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గూడూరు రైల్వేస్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో అంజినాయుడు, ప్రదీప్, శ్రీనివాసులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్‌లోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి హరిష్, సిబ్బంది వినయ్, నరసింహం, శ్రీహరి, సునీల్, దుర్గాప్రసాద్, దేశయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి: ఎండల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి నారాయణ ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు
నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరు సమీపంలో ఆటోను ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. బుధవారం మల్లాం నుంచి నాయుడుపేటకు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రమణయ్యతో పాటు మరో ముగ్గిరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేశవరంలో పోషణ్ పక్వాడ



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కవిత

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని కేశవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో తల్లులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. తల్లులు, గర్భిణులు ఇంటి వద్దే పోషకాహారాన్ని తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్, ఇతర ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు.

వసంతోత్సవాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్టలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఉభయాలు నిర్వహించి గుగ్గిళ్ల పంపిణీ చేశారు.



ఉట్టి కొడుతున్న చిన్నారులు

కుదిరిలో రీ సర్వేపై గ్రామసభ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుదిరి గ్రామంలో బుధవారం రీ సర్వేపై తహసీల్దార్ నరసింహారావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కుదిరి, తిప్పకండ్రిగ గ్రామాల్లో వచ్చే వారం పైలెట్ ప్రాజెక్టు కింద రీసర్వే ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీదేవి, నీలిమ, హైమావతి, సర్వేయర్లు బాలాజీ, సతీష్, రాము పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, చెత్త వాహనాల డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెంచలయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మని, నాగరాజు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన పొట్టపూడి రాజేష్, గురుమూర్తి, సురేష్, తడ మండలానికి చెందిన కొందరు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. బుధవారం రాత్రి రేణిగుంట నుంచి నెల్లూరు వెళ్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి నాయుడుపేటలో మాజీ ఎంపీ నెలవల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

చదువులతోనే ఉజ్వల భవిత

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పాఠశాలలో వివిధ తరగతులలో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంసా సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

గూడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని తిరుపతి ఇరిగేషన్ డీఈ మురళి అన్నారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా విజ్ఞప్తుల దినంలో ప్రజలు అందజేసే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు, తెలుగుగంగ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ కల్పన పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి
దాతల సహకారం అభినందనీయం

పెళ్లకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, మధునాయుడు అన్నారు. పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కళావేదికను వారు ప్రారంభించారు. పెన్నేపల్లికి చెందిన మాజీ సర్పంచు గాలి రమేష్‌నాయుడు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3 లక్షలతో కళావేదికను నిర్మించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గాలి రమేష్‌నాయుడు, జయప్రద దంపతులు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ కంపెనీ ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న మెడిన్‌షా కంపెనీ ప్రతినిధి

కోట, ఏప్రిల్ 16: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలను జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. 2018 నుంచి ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీతో పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. తాజాగా టెక్నికల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్, ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు అవగాహన కుదుర్చుకున్నారు. కంపెనీ ప్లాంట్ హెడ్ రమేష్ చంద్రాసింగ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్ సిప్లా, ఆపరేషన్ డైరెక్టర్ టెకాయకి సానోసాన్, మునుపటి ఎండీ యమమోటో, ప్రస్తుత ఎండీ వకుయాలు కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించారు. నాయుడుపేట మండలం మేనకూరు ప్లాంట్ ఎండీ వకుయా మాట్లాడుతూ అహ్మదాబాద్ - ఢిల్లీ బుల్లెట్ ట్రైన్ ఆర్డర్ తమకే లభించిందని, తద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మూడవ సంవత్సరం మెకానికల్, ఎలక్ట్రికల్ చదువుతున్న విద్యార్థులకు మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇచ్చి ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్ కిషిందర్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.


వృత్తి నైపుణ్యంలో మహిళలు రాణించాలి



మహిళకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మౌర్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి నైపుణ్యంలో రాణించి ఆర్థికంగా బలపడాలని తిరుపతి నగరపాలకసంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. శ్రీకాళహస్తిలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ శ్రీకాళహస్తి పైప్స్ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆమె హాజరయ్యారు. ప్రతి సంస్థా సమాజం పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఈసీఎల్ సంస్థ తమ పరిసర ప్రాంతాల్లోని మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ... తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగానే టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ వంటి శిక్షణలను మహిళలకు ఇస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని విశాలక్ష్మినగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త శంకర్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వరదయ్యపాళెంలో వర్షం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండల కేంద్రంలో బుధవారం కొద్ది సేపు వర్షం కురిసింది. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. సుమారు అరగంటపాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

నారాయణవనం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శ్మశానాల్లో వసతి కల్పిస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. బుధవారం ఉదయం నారాయణవనం శ్మశాన ప్రహరీ, దహనవాటిక నిర్మాణానికి భూమి పూజ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, అధికారులు, ప్రజాపతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో మొబైల్ హంట్, సీఇఐఆర్ పోర్టల్ ద్వారా రూ.1.12 కోట్ల విలువైన 510 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే మొబైల్ హంట్ వాట్సాప్ 9490617873 ద్వారా సీఇఐఆర్ పోర్టల్‌కు సమాచారమివ్వాలన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు 12 విడతల్లో రూ.7.56 కోట్ల విలువచేసే 4,275 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సెల్‌ఫోన్లు అమ్మడానికి వస్తే దుకాణదారులు బిల్లులు పరిశీలించాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరచిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.